
## క్లుప్తంగా

### గడువులోగా అర్జీలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి

**కోటనందూరు:** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం, విధివిధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణశర్మ, ఎంఈఓ శ్రీనివాస్, ఆర్ఐ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా నిరసన

**గండేపల్లి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానానికి ప్రత్యామ్నాయం ఏదీ లేదు కాబట్టి దానిని మాత్రమే కొనసాగించాలని కోరుతూ గండేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుభాష్, రాజబాబు, భాస్కర్ రావు, ఆదినారాయణ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

### నిందితుడికి 14 రోజుల రిమాండ్

**గండేపల్లి:** సారా కేసులో నిందితుడికి పెద్దాపురం కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్టు గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని కె.గోపాలపురానికి చెందిన అరిగే చెల్లయ్యను 20 లీటర్ల సారాతో అరెస్టు చేసి పెద్దాపురం కోర్టుకు తరలించారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్టు చెప్పారు.

### విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



జగ్గంపేటలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్సై రఘునాథరావు

**జగ్గంపేట:** స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎస్సై రఘునాథరావు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. జగ్గంపేటలో గత రెండు రోజులుగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఏడుగురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్సై రఘునాథరావు తెలిపారు. కోర్టు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించిందని చెప్పారు. 10 రోజుల వ్యవధిలో 15 మందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వీరిలో ఒక్కరికి మాత్రమే మూడు రోజులు జైలు శిక్ష పడింది. మిగిలిన 14 మంది రూ.10 వేల చొప్పున జరిమానా చెల్లించారని ఎస్సై వివరించారు.

### విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

**తుని:** గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాల ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము డిమాండ్ చేశారు. పట్టణంలో ఆ మేరకు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ హిడెన్ కెమెరాల ఉదంతం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో పటిష్ట ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకొని విద్యార్థినులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### 2న వికాసలో జాబ్ మేళా

**కాకినాడ సిటీ:** వికాస ఆధ్వర్యంలో సెప్టెంబర్ రెండున సంస్థ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం ఇక్కడ తెలిపారు. ఈ జాబ్ మేళాలో క్యాపిటల్ ట్రస్ట్ లిమిటెడ్‌లో బీఎం, బిక్యూఎం, ఆర్ఓ, ఐఆర్ఈపీ క్రికెట్ క్యాపిటల్‌లో సేల్ ఆఫీసర్, సీనియర్ సేల్స్ ఆఫీసర్, ఇండో ఎంఐఎం, పానాసోనిక్ కంపెనీల్లో టెక్నీషియన్, రివ్యూటెడ్ ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్ట్, హెల్పర్, ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ (బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ 2023, 2024 పాస్ అవుట్) ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని వివరించారు. వీరికి రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 2వ తేదీ కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్సులతో హాజరుకావాలని తెలిపారు.



తంటికొండ వెంకన్న సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



తుని చిట్టూరిమెట్రోలో వరలక్ష్మీవ్రతం ఆచరిస్తున్న మహిళలు



ప్రత్తిపాడులో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

# వరలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



విష్ణుపురం శ్రీమహావిష్ణు ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

**తుని రూరల్:** శ్రావణమాసంలో నాలుగో శుక్రవారం కావడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. టి.తిమ్మాపురం శివారు విష్ణుపురంలో వేంచేసిన శ్రీమహావిష్ణు ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రేగడమిల్లి ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో సమీప గ్రామాలకు చెందిన వందలాది మంది మహిళలు పాల్గొని సామూహిక వ్రతాలు, పూజలు ఆచరించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు పోల్నాటి శేషగిరిరావు దంపతులు పాల్గొన్నారు. సుభద్రయ్యమ్మపేటలోని చిన్న షిర్డీ ఆలయంలో ధర్మకర్త ఆళ్ల నాగేశ్వరరావు పర్యవేక్షణలో వందలాది మంది మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అమ్మవారికి నవకలశాలతో పంచామృతాభిషేకాలు, పసుపు కొమ్ములతో సౌభాగ్యదాయిని అలంకరణ చేశారు. లక్ష కుంకుమార్చన, సహస్ర దీపాలంకార సేవ నిర్వహించారు. వి.కొత్తూరు, తేటగుంట, హంసవరం, డి.పోలవరం, ఎస్.సూరవరం గ్రామాల్లో మహిళలు ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు.

**గోకవరం:** మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణమాసంలో చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, సువర్ణతులసీ దంపతుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించగా సుమారు 500 మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచరించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు ఉచితంగా పూజాసామగ్రి, రూపులు ఇతర సామగ్రి అందించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**ఏలేశ్వరం:** శ్రావణ మాసంలో చివరి శుక్రవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహిళలు ఉదయం ఇళ్ల వద్ద పూజలు చేసి సాయంత్రం ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, తోట వీధి, మార్కెట్ వీధి, దిబ్బలపాలెం తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆలయాల వద్ద మహిళలు ఇబ్బందులు పడ్డారు. పలు ఆలయాల వద్ద మహిళలు భక్తి గీతాలు ఆలపించారు.

**గాజుల అలంకరణలో నేరేళ్లమ్మ**



గాజుల అలంకరణలో నేరేళ్లమ్మ అమ్మవారు

**అన్నవరం:** స్థానిక మెయిన్ రోడ్‌లో కొలువైన గ్రామ దేవత నేరేళ్లమ్మ అమ్మవారు శుక్రవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు ఎనిమిది గాజులతో అమ్మవారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.

**శుభంకరీలక్ష్మిగా వరమహాలక్ష్మి**

**తుని:** స్థానిక చిట్టూరి మెట్రోలో వేంచేసిన వరమహాలక్ష్మి అమ్మవారు శ్రావణమాసంలో నాల్గో శుక్రవారం సందర్భంగా శుభంకరీలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**ప్రత్తిపాడు రూరల్:** ప్రత్తిపాడు సాయిబాబా ఆలయంలో వేంచేసిన లక్ష్మీదేవి అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు.

### పసుపుకొమ్ముల అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



ఎస్.అన్నవరంలో సౌభాగ్యదాయిని అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

**తుని రూరల్:** మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అమ్మవారికి పసుపు కొమ్ములతో సౌభాగ్యదాయిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### ఘనంగా పైడిమల్లమ్మ తీర్థం



నిప్పుల గుండం వద్దకు ఊరేగింపుగా పూజారిని తీసుకువస్తున్న భక్తులు

**ఏలేశ్వరం:** గ్రామ దేవత పైడిమల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక పెద్దవీధిలోని అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిప్పులగుండాన్ని పూజారి తొక్కారు. స్థానిక దిబ్బలపాలెం నుంచి పూజారిని శక్తివేషం, తీన్‌మార్, బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిప్పుల గుండం చూసేందుకు మహిళలు పోటీ పడ్డారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

### పరిహారం చెల్లించాకే భూ కేటాయింపులు

**తుని రూరల్:** రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి, సమస్యలు పరిష్కరించిన తర్వాతే ప్రత్యేక ఆర్థిక మండలి (కేఎస్ఈజెడ్)లో భూ కేటాయింపులు జరగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తుని మండలం తేటగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పెద్దాపురం ఆర్డీఓ సీతారాములు, తొండంగి తహసీల్దార్ మురార్జి, ఎస్ఈజెడ్ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఎస్ఈజెడ్‌కు సేకరించిన 500 ఎకరాలకు సంబంధించిన రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. గతంలో రూ.పది లక్షలు చొప్పున పరిహారం చెల్లించినా ఇష్టపడని రైతులు పరిహారాన్ని తీసుకోలేదన్నారు. ఇందుకు సంబంధించిన మొత్తం రూ.59 కోట్లు కలెక్టర్ వద్ద డిపాజిట్ చేసి ఉందన్నారు. ఇప్పుడు పరిశ్రమలు స్థాపించేందుకు భూ కేటాయింపులకు ఉపక్రమిస్తున్నందున గతంలో కంటే ఎక్కువ మొత్తంలో పరిహారాన్ని రైతులు ఆశిస్తున్నట్టు యనమల పేర్కొన్నారు. రైతుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకుని తగిన మొత్తంలో చెల్లించాలని ఆదేశించారు. అవసరమైతే రైతులతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సూచించారు.

## వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

**అన్నవరం:** రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పండితులు చెళ్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 50 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

**అమ్మవార్లకు ప్రత్యేక పూజలు**

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రుత్విక్కులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకులు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు.

### బెల్లపు ఊట ధ్వంసం

**జగ్గంపేట:** మండలంలోని మల్లిసాల గ్రామ శివారులో సారా తయారీ కేంద్రాలపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేస్తున్న చీకట్ల త్రిమూర్తులును అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్సై రఘునాథరావు తెలిపారు. మండలంలో సారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు.

### మల్లేపల్లిలో వన మహోత్సవం

**గండేపల్లి:** మండలంలోని మల్లేపల్లిలో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



భూపతిపాలెం గురుకుల పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గోకవరం:** ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ ప్రతి నెలా సెల్ఫీ తీసి పెట్టాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గళ్లా రాము, ప్రిన్సిపాల్ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

## 13,14 తేదీల్లో జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్





ఆదిత్యలో వేద-2కే24 పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూనివర్సిటీ చాన్సలర్ సతీష్‌రెడ్డి

**గండేపల్లి:** సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో వేద-2కే24 పేరిట జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్టు యూనివర్సిటీ ఛాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. భారత రత్న మోక్షగుండం విశ్వేశరయ్య జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 15న ఇంజినీర్స్ డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా వేద-2కే24 పేరిట వచ్చే నెల 13, 14 తేదీల్లో జాతీయస్థాయి టెక్ ఫెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆదిత్య యూనివర్సిటిలో వేద-2కే24 జాతీయస్థాయి టెక్ ఫెస్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. విద్యార్థులకు పేపర్, పోస్టర్స్, ప్రాజెక్ట్ ప్రజంటేషన్ వంటి కాంపిటేషన్లతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ఎస్.రమాశ్రీ, జి.సురేష్, డీన్ డోలా సంజయ్, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విస్తారంగా వర్షాలు

- ఎడతెరిపి లేకుండా వర్షం
- పల్లపు ప్రాంతాలు జలమయం



ఏలేశ్వరం చైతన్యనగర్‌లో నీట మునిగిన రహదారి

**ఏలేశ్వరం:** అల్పపీడన ప్రభావంతో ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట నియోజకవర్గాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నారు. మెట్టలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. ఉదయం నుంచి రాత్రి వరకూ వర్షం పడుతూనే ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బయటకు వచ్చేందుకు వీలులేకపోవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో రహదారులు నీటమునిగాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వర్షపునీరు నిల్వ ఉండిపోయింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం బురదమయంగా మారింది. మండలంలోని లింగంపర్తి, జె.అన్నవరం, మర్రివీడు, తూర్పులక్ష్మీపురం తదితర గ్రామాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**తుని రూరల్:** మండలవ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో సాధారణ జనజీవనానికి అంతరాయం కలిగింది. మెట్టలో ఖరీఫ్ వ్యవసాయానికి ఈ వర్షాలు అనుకూలంగా ఉన్నాయని, పత్తి, కూరగాయలు వంటి ఆరుతడి పంటలకు నష్టం వాటిల్లుతుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. ఆరుతడి పంటలు సాగు చేసిన పొలాల్లో నీటి నిల్వ లేకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**విస్తారంగా కురుస్తున్న వర్షం**

**ప్రత్తిపాడు రూరల్:** అల్పపీడన ప్రభావంతో ప్రత్తిపాడు మండల వ్యాప్తంగా శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు ఉధృతంగా ప్రవహించాయి. ప్రజలు అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రహదారులపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రహదారులపై ప్రయాణించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. జలాశయాలు, పంట చెరువుల్లోకి నీరు వచ్చి చేరింది.

**తెరిపివ్వని వర్షం**

**తొండంగి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులు తెరిపివ్వకుండా వర్షం కురవడంతో పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్రవారం మండలవ్యాప్తంగా కుండపోత వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాల్లోని వర్షం నీరు ఏరులై పారడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటుక బట్టీలు, తాండ్ర పరిశ్రమలు తాత్కాలికంగా మూత పడ్డాయి. అల్పపీడనం వాయుగుండంగా మారి తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**ఎగసి పడుతున్న అలలు**

అల్పపీడనం ప్రభావంతో తీరంలో అలల ఉధృతి మరింత పెరిగింది. సుమారు రెండు మీటర్లు ఎత్తు వరకూ అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రంలో ప్రతికూల వాతావరణం కారణంగా మత్స్యకారులు తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. అనుకూల వాతావరణం ఏర్పడే వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లరాదని మత్స్యశాఖ అధికారి ఉమామహేశ్వరరావు సూచించారు.



దానవాయిపేట తీరంలో ఎగసిపడుతున్న అలలు



ఏలేశ్వరంలో బురదమయంగా మారిన పాఠశాల ప్రాంగణం



పెద్దిపాలెం - ఉత్తరకంచి రోడ్డుపై గోతుల్లో నిలిచిపోయిన వర్షపు నీరు



ప్రత్తిపాడులో చెరువును తలపిస్తున్న అల్లూరి సీతారామరాజు జంక్షన్

## సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ



తునిలో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

**తుని:** సీజనల్ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటరావు సూచించారు. పట్టణంలోని 22, 23 వార్డుల్లో శుక్రవారం డెంగీ, మలేరియా వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ జ్వరాలను అదుపు చేయవచ్చన్నారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీఆర్ శేఖర్, శానిటరీ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

**శంఖవరం:** డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ప్రజలకు శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూటే కుడుతుందని తెలిపారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ లేదని, లక్షణాలకు అనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతిఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఎన్టీఆర్ ఇళ్ల బిల్లులు

**సామర్లకోట:** మండలంలో 1,400 ఎన్టీఆర్ గృహాలకు బిల్లులు చెల్లించవలసి ఉందని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టరు ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. జి.మేడపాడులో గృహాల బిల్లులపై సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2017 నుంచి 2019 వరకు ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. అప్పటి నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్టు చెప్పారు. సర్వే చేసి లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అవుతాయన్నారు. వంద రోజుల నిర్దేశిత లక్ష్యంలోగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. హౌసింగ్ ఇంజినీరు వై శ్రీనివాసు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, మండల ఇంజినీరు మహమ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.